క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



టేకుమట్ల: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో మండలంలోని ద్వారకపేట విద్యార్థి సముద్రాల అజయ్‌కుమార్ ప్రతిభ చాటాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో 2639 ర్యాంక్ సాధించాడు. అజయ్‌కుమార్ తల్లిదండ్రులు సుమారస్వామి–లత వ్యవసాయ కూలీలుగా జీవనం కొనసాగిస్తూ ప్రభుత్వ గురుకులాల్లో చదివించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో న్యూరాలజిస్టుగా సేవలను అందిచడమే లక్ష్యమన్నారు.

వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సందర్శన కార్యక్రమం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఇటీవల ప్రసవించిన బాలింతల ఇంటింటికీ వెళ్లి బాలింతల ఆరోగ పరిస్థితులు తెలుసుకొని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం తల్లి పాల ప్రయోజనాలు, రెగ్యూలర్ టీకా ప్రాముఖ్యత, ఐరన్‌రిచ్ డైట్ మొదలైన వాటిగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రేగొండ: రాజీకాదగిన కేసులను పరిష్కరించుకునేందుకు కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రవికుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ జూన్ 8న భూపాలపల్లిలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని, పలు రకాల పాత కేసులను పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని కేసును శాశ్వతంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.

కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.కె.బుచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు, ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని అన్నారు. ఆసక్తిగల విద్యార్థులు కులం, ఆదాయం, నివాస ధృవీకరణపత్రాలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయించొద్దు

పరకాల : పట్టణంలోని ఎరువులు, విత్తన వ్యాపారులు రైతులకు అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ ఏ.వి భాస్కర్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని విత్తనాల దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ మండల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, బిల్లులను పరిశీలించారు. మార్కెట్ సరిపడ విత్తనాలు ఉన్నాయని రైతులు ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



చల్వాయిలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు



కన్నాయిగూడెం: భూపతిపురంలో..



వెంకటాపురం(కె)లో..

వాజేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడానికి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విధిగా బడిబాట కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

వెంకటాపురం(కె): మండలంలో జయశంకర్ బడిబాట కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ బడిబాట కార్యక్రమం ఈ నెల 19 వరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

గోవిందరావుపేట: బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో బడి ఈడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను పాఠశాల్లో చేర్పించాలని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్, సీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు రమ, దీప్తి, అన్నపూర్ణ, శ్రీదేవి, వాసుదేవరెడ్డి, రమేష్, శివ, శ్యామ్, సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి

ములుగు: తల్లిదండ్రులు బాలికల విద్యను ప్రోత్సహించాలని మండలంలోని మాధవరావుపల్లి కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జీవనప్రియ సూచించారు. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల గ్రామంలో ఇంటిటా తిరుగుతూ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేజీబీవీలో ఉన్న సౌకర్యాలు, విద్య ప్రమాణాలపై వివరించారు. తల్లిదండ్రులతో కలిసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ఇంగ్లీష్ మీడియంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియేట్‌లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మిగతా వివరాలకు 80086 18668కి సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్టీలు విజయ, మమత పాల్గొన్నారు.



వాజేడు: బడిబాటను ప్రారంభిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కన్నాయిగూడెం: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండలంలోని గుర్రేవుల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, గుర్రేవుల హైస్కూల్ ఉపాధ్యాయులు, ప్రాధానోపధ్యాయులు బడిబాట కార్యక్రమం వేర్వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, అంజయ్య, స్వాతి, రవి, కిరన్, రజినీ, సీఆర్పీ రమేష్, కృష్ణప్రసాద్, బానోత్ శ్రీనువాస్, వెంకన్న, రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లూర్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. బడిబాట కార్యాక్రమంలో భాగంగా మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పిల్లల నమోదుకు ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడిబాట కార్యక్రమాన్ని ఈనెల 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బడిబాటలో చిన్నారుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించనున్నట్లు పేర్కొన్నారు. చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలలకు తీసుకరావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, తిరుపతి, శివలింగం జగన్‌నాయక్, విజయభాస్కర్, శ్రీనివాస్, స్వర్ణలత, సవిత, మహేష్, వినోద్‌కుమార్ తదితర పాల్గొన్నారు.

మహాముత్తారం: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంతో పాటు ములుగుపల్లి, యామన్‌పల్లి, పోలారం గ్రామాల్లో ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నవోదయ, గురుకుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాముత్తారం మండల పరిషత్ పాఠశాల అమ్మ ఆదర్శ చైర్మన్ మాచర్ల శైలజ, ఉపాధ్యాయులు బోజ్యా నాయక్, సంజీవరెడ్డి, రాజేంద్రప్రసాద్, బాలరాజు, సదానందం, సంతోష్, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.



ములుగు: విద్యార్థికి కరపత్రాన్ని అందిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డి పేట గ్రామంలో బడీడు పిల్లలను బడికి పంపాలని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనందిస్తున్నామని తెలిపారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్ కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం గురువారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. మొట్లపల్లి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు వివిధ కాంపిటీటివ్ పరీక్షల్లో విజయాలు సాధిస్తున్నారన్నారు. ఎన్‌సీసీలోను, ఆటల్లోను ప్రతిభాను చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చిలుకూరి కరుణ ఉన్నారు.

కళాశాలకు భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న నాగరాజు

ములుగు రూరల్: గిరిజన మహిళా డిగ్రీ గురుకుల కళాశాలకు పక్క భవనాన్ని నిర్మించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017–18వ సంవత్సరంలో కేజీ టూ పీజీ విద్యలో భాగంగా జిల్లా కేంద్రంలో గిరిజన మహిళా గురుకుల కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వసతులు సరిగా లేక పోవడంతో హనుమకొండ జిల్లా ఒగ్లాపూర్ వద్ద అద్దె భవనంలో కొనసాగించారని అన్నారు. ప్రస్తుతం ఏటూరునాగారంలోని సీఎంఆర్ భవనంలో కొనసాగిస్తున్న మహిళ డిగ్రీ గురుకుల కళాశాలకు పక్క భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతి రెడ్డి రవిరెడ్డి, రాకేష్, మహేష్, నరేష్‌శర్మ, సిద్దార్థ రమేష్, సాయి, దేవేందర్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు



కొబ్బరి చెట్టుపై పడిన పిడుగు

టేకుమట్ల: మండలంలో గురువారం గాలిదుమారంతో పాటు పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. కాగా చూట్టపక్కల వారికి ఏలాంటి ప్రమాదం జరుగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ)కి చెందిన లడే రాజబాబు ఇంటి అవరణంలో ఉన్న కొబ్బరి చెట్టుపై గురువారం సాయంత్రం పిడుగు పడింది. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులకు ఏలాంటి ప్రమాదం జరుగలేదు.

గాలివాన బీభత్సం



దేవరాంపల్లి వద్ద ప్రధాన రహదారిపై కూలిన చెట్టు

కాటారం: మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలితో కూడిన వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు భారీ గాలులు వీయడంతో గ్రామాల్లోని గుడిసెల పైకప్పులు లేచిపోయాయి. కాటారం మంథని రహదారిపై పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. పలు దుకాణాల ఎదుట బోర్డులు గాలికి కొట్టుకుపోయాయి. గాలివాన కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

రెండు ఎద్దుల మృతి..

మండలంలోని శంకరాంపల్లి ఎస్సీ కాలనీలో మామిడి తిరుపతి అనే రైతుకు చెందిన రెండు దుక్కిటెద్దులు పిడుగుపాటుతో మృతి చెందాయి. ఇంటి ఆవరణలో కట్టేసిన ఎద్దులు ఆకస్మాత్తుగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. ఎద్దుల మృతితో సుమారు రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు తిరుపతి కోరారు.



పిడుగుపాటుతో మృతి చెందిన ఎద్దులు

రోడ్డుపైన ఇసుక లారీల పార్కింగ్





జాతీయ రహదారిపై నిలిపివేసిన లారీలు

ఏటూరునాగారం: జాతీయ రహదారిపై ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) ఇసుక క్వారీల ఇసుక లారీలను పార్కింగ్ మళ్లీ మొదలైంది. పోలీస్ శాఖ ఎన్నిసార్లు హెచ్చరించిన లారీ డ్రైవర్ల తీరు మారడం లేదు. ఇసుక క్వారీ నిర్వహకుల ధైర్యంతోనే లారీలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. కొన్ని రోజుల క్రితం ఎస్పీ శబరిష్ ఇసుక క్వారీ నిర్వాహకులకు లారీ డ్రైవర్లను హెచ్చరించారు. అయినప్పటికీ లారీలను రోడ్డుపై నిలిపివేసి లారీ డ్రైవర్లు వారి ఇష్టానుసారంగా తిరుగుతున్నారు. ఎస్సై కృష్ణ ప్రసాద్ లారీలకు కొన్ని రోజుల క్రితం జరిమానా విధించినప్పటికీ అంతపెద్దగా పట్టించుకోవడం లేదు. జరిమానా డ్రైవర్లకు పరిపాటిగా మారింది. రోడ్లపై ఇసుక లారీల నిలిపివేయడం వలన చాలామంది ప్రయాణికులు ఇసుక లారీలు ఢీకొని చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని ఎస్పీ లారీ డ్రైవర్లను మందలించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదు. ఇసుక లారీ నిర్వాహకుల వల్లనే డ్రైవర్లు తెగబడి రోడ్ల పైననే లారీలు నిలిపివేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి లారీలను సీజ్ చేయాలని లేనట్లయితే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. ఐటీడీఏ మూల మలుపు వద్ద లారీల ట్రాఫిక్ జామ్ కావడంతో ఆర్టీసీ బస్సులు ఏటూరునాగారం గ్రామంలోని సీఎస్ఐ రోడ్డు నుంచి ప్రయాణించాల్సి వచ్చింది.

ఆర్థికసాయం



సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గీసుకొండ : మండలంలోని కొమ్మాలకు చెందిన కౌలు రైతు గడ్డమీది అశోక్ అప్పుల బాధతో బుధవారం ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి గురువారం రూ.5 వేల సాయం అందజేశారు. ఆయన పంపిన డబ్బును స్థానిక నాయకులు మర్రెడ్డి ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందించారు. అలాగే ఎలుకుర్తిలో రెండు బాధిత కుటుంబాలకు కిశోర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, గడ్డమీది రమేశ్, వీరాటి రవీందర్‌రెడ్డి, బొడిగె శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



రోడ్డుపై పగిలిన మద్యం సీసాలు, వాహనాలు



మొండయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కాళేశ్వరం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మద్దులపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాళేశ్వరం మద్యం దుకాణం నుంచి కుంట్లం గ్రామానికి మద్యం తీసుకుని ద్విచక్రవాహనం వెళ్తున్నారు. ఈ క్రమంలో నాగేపల్లి నుంచి కాళేశ్వరం ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. దీంతో రెండు వాహనాలు ఎదురురేదుగా ఢీ కొనడంతో నాగేపల్లికి చెందిన మొండయ్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108ఫోన్ చేసిన రాలేదు. ఆటోలో మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుంట్లం గ్రామానికి చెందిన బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలు రోడ్డుపై పడి పగిలిపోవడంతో రోడ్డుపై గాజు సీసాలను వారు అప్పటికప్పుడే తొలగించారు. కొంత సేపు అక్కడ రోడ్డుపై జనంతో రసబాసా జగిరింది. ఈ ప్రమాదంపైన పోలీసుస్టేషన్‌లో ఎవరూ ఫిర్యాదు చేయనట్లు తెలిసింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల: పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపూర్, పాత ఇస్సిపేట, ఇస్సిపేట, మొగుళ్లపల్లి గ్రామాలకు చెందిన నాంపల్లి రమక్క, దశరథం, జెన్నె పోచమ్మ, పెంతల రాజయ్య, బత్తిని నరిసింహరాములు, శివకుమార్, బల్గూరి రామారావు ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఆకుతోట కుమారస్వామి, ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, ఎండి రఫీ, ప్రకాశ్‌రావు, నర్సింహరెడ్డి, జయపాల్‌రెడ్డి, రాము, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకటలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఓరం సమ్మయ్య, మండల కోఆప్షన్ సభ్యులు రాజ్‌మహ్మద్, నాయకులు కిష్టయ్య, గుర్రపు తిరుపతి గౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, మాజీ సర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రావు, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్‌గౌడ్, కుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీ సిరికొండ పరామర్శ

మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకటలక్ష్మి, మండలంలోని జడలపేట గ్రామానికి చెందిన బయగాని రాజవీరు, మొగులోజు రాజనర్సయ్య, ఒడితల గ్రామానికి చెందిన మేరుగు పద్మలు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా, మండల నాయకులు చింతల రమేష్ , పువ్వాటి హరికృష్ణ, కొడెల రాయమల్లు, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, రాయిని శ్రీకాంత్, వీణవంక శ్రీదేవి, కంచేర్ల కుమారస్వామి, గణపతి, రాజు, రవి, చంద్రమొగిలి, ముసాపూరి రవీందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీ సాగర్ పరామర్శ

మండల కేంద్రానికి చెందిన బుర్ర వెంకటలక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ గొర్రె సాగర్ పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం

నర్సంపేట : మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధికి తాను ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ తెలిపారు. పట్టణంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు వేసి తనను ఆశీర్వదించారంటూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో పార్టీకి ఓట్ల శాతం పెరగడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అహర్నిశలు కృషి చేసిన శ్రేణులను అభినందించారు. జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో పార్టీ అధికారంలోకి రానున్న నేపథ్యంలో నియోజకవర్గం అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు.